బడీడు పిల్లలు బడిలో ఉండాల్సిందే..

సిద్దిపేట అర్బన్, మే 30 : బడీడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండాల్సిందేనని కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి 'బడి బాట' కార్యక్రమ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మాత్రమే కాకుండా ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొనాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

కలెక్టర్ మను చౌదరి

ని ఇంటింటికీ వెళ్లి డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి బడుల్లో చేర్పించాలన్నారు. ఎంతో కష్టపడి వేలాది రూపాయాలు ఫీజులు చెల్లించి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించే తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులు, ఉచిత విద్య తదితర విషయాలపై వివరించాలన్నారు. అడ్మిషన్ దొరకని ప్రభుత్వ పాఠశాలల గురించి తల్లిదండ్రులకు చెప్పి మళ్లీ విద్యార్థులు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నర్సాయపల్లిల్లో 'గుప్తనిధి' కలకలం

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామంలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న చేర్యాల సీఐ శ్రీను

మద్దూరు(ధూళిమిట్ట), మే30: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామంలో ఉపాధి పనుల చేస్తున్న కూలీలకు దొరికిన ఓ రాతి పెట్టె గ్రామంలో కలకలం సృష్టించింది. బుధవారం గ్రామానికి చెందిన చల్లా మల్లారెడ్డి భూమిలో ఉపాధి హామీ కూలీలు భూమి చదును పనులు చేస్తుండగా ఓ రాతిపెట్టె దొరికింది. ఓ మహిళా కూలీ రాతిపెట్టెను తన ఇంటికి తీసుకెళ్లింది. గురువారం ఉదయం ఈ విషయం బహిర్గతమై అధికారుల దృష్టికి వెళ్లడంతో మహిళా కూలీ వద్ద ఉన్న రాతిపెట్టెను పోలీసులు స్వాధీనం చేసుకుని తెరిచి చూడగా 25 వెండి నాణేలు, రెండు వెండి ఉంగరాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలాన్ని చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో రామ్మోహన్ సందర్శించారు. లభ్యమైన వెండి నాణేలు, ఉంగరాలను పురావస్తుశాఖకు అప్పజెప్పుతున్నట్లు వారు తెలిపారు. నర్సాయపల్లిలో లభ్యమైన వెండి నాణేలు క్రీ.శ 1658-1707 కాలంనాటివిగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.

కార్మికుల శ్రమ దోపిడీ

జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్

చేర్యాల, మే 30 : నేటి ప్రభుత్వాలు దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ సరళీకరణ పేరుతో ఆర్థికంగా కార్మికులను దోచుకునే పద్ధతిని అవలంభిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలడుగు సుధాకర్ ఆరోపించారు. పట్టణంలోని వాసవి గార్డెన్స్‌లో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పకాయల శోభ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాడూరి రవీందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్, మండల కన్వీనర్ రేపాక కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులు ఏకం కావాలి

సిద్దిపేట టౌన్, మే 30 : సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఏకమై ఐక్యపోరాటాలను నిర్మించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు అంశాలపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో పద్మ, రవికుమార్, మహేశ్, కనకయ్య, బాలనర్సయ్య, రాజమౌళి, కొమురయ్య, యాదగిరి, ఎల్లయ్య, ప్రభాకర్, మల్లయ్య, మహేశ్, రాజయ్య తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

గజ్వేల్, మే 30 : కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపు నిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం కార్యాలయంలో జెండా విష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతాంగాన్ని నష్టపరిచే విధంగా కార్మికవర్గం ఉపాధి దెబ్బ తీశారన్నారు. నాయకులు బండ్లస్వామి, రవి, రంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక, మే 30 : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం దుబ్బాక పట్టణంలో జెండా విష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక వైశ్యభవన్‌లో సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావం అనే అంశంపై సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. భాస్కర్, ప్రవీణ, మంజుల, భాగ్యలక్ష్మి, రాజు, మల్లేశం, లింగం, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం

వర్గల్ పురవీధుల్లో విమానరథంపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి

వర్గల్, మే 30 : వర్గల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం వర్గల్ గ్రామ పురవీధుల గుండా వైభవోపేతంగా కొనసాగింది. రథంపై ఉన్న దేవతామూర్తులను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తో పాటు వర్గల్ జడ్పీటీసీ బాల మల్లు యాదవ్, ఎంపీపీ లతారమేశ్ గౌడ్ దర్శించుకున్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా సప్తాహం

సిద్దిపేట, మే 30 : సిద్దిపేట గణేశ్ నగర్‌లోని శ్రీ ప్రసన్నంజనేయ స్వామి ఆలయంలో 'అఖండ హనుమాన్ చాలీసా సప్తాహం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ ప్రసన్నంజనేయ స్వామి చారిటబుల్ ట్రస్ట్, ఆలయ అర్చకులు చిలక మర్రి వెంకట రమణ చార్యులు ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిర్విరామంగా హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. నేడు గురువారం ఐదో రోజు అద్భుతంగా సాగింది. ఇలాంటి మహాత్కార కార్యంలో నేను అర్చకుడిగా భాగస్వామ్యమైనందుకు అదృష్టంగా భావిస్తున్నానని ఆలయ అర్చకులు చిలక మర్రి వెంకట రమణ చార్యులు తెలిపారు.

అఖండ హనుమాన్ చాలీసా సప్తాహం కార్యక్రమంలో భక్తులు

రైల్వే సేవలకు అంతరాయం

సిద్దిపేట, మే 30 : సిద్దిపేట టు సికింద్రాబాద్ రైల్వే సర్వీసు సేవలకు ఆరు రోజుల పాటు అంతరాయం ఏర్పడిందని రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద పుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం కారణంగా జూన్ 1,2,5,6,8,9 తేదీల్లో సిద్దిపేట టు సికింద్రాబాద్ మార్గంలో రైల్వే సర్వీసులు నిలిపివేయబడ్డాయని తెలిపారు.

సకాలంలో యూనిఫామ్ అందజేయాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

గ్రూప్‌సభ్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

గజ్వేల్, మే 30 : జూన్ 2లోగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు సకాలంలో అందజేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని దిలాల్‌పూర్‌లో ఎస్‌హెచ్‌జీ గ్రూప్ ఆధ్వర్యంలో కుడుతున్న యూనిఫామ్‌ల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫామ్‌లను కుట్టడంతో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఆర్థికంగా ఎదిగే అవకాశాలున్నయని అందుకు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డుల నిర్వాహణ తప్పకుండా ఉండాలన్నారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో దయాకర్, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

వెంచర్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

గజ్వేల్, మే 30 : మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న వెంచర్లను గురువారం మధ్యాహ్నం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పరిశీలించారు. వెంచర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నయో లేవో తెలుసుకునేందుకు రోడ్లను కొలతలు వేసి పరిశీలించారు. నిబంధనల మేరకు వెంచర్లలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నయా అంటూ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గజ్వేల్‌లోని విద్యార్థుల యూనిఫామ్ కుట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్వాహకుల ద్వారా వివరాలు తెలుసుకొని త్వరగా యూనిఫామ్‌ల కుట్టడం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేదల జీవితాలను మార్చండి..

దామరకుంటలో విలేకర్లతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మర్కూక్, మే 30 : సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ చిహ్నాలను మార్చడంకాదు పేద ప్రజల తలరాతలను మార్చాలని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, బీఆర్ఎస్ నాయకులు లక్కాకుల నరేశ్ ప్రభుత్వానికి సూచించారు. గురువారం మండలంలోని దామరకుంటలో విలేకర్లతో మాట్లాడుతూ మార్పుతెస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పేదలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. మార్పంటే చిహ్నాలను కాదు, పేదప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు కనకయ్య, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాల గురించి పోలీస్ అధికారులకు శిక్షణ

సిద్దిపేట అర్బన్, మే 30 : నూతన చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి పరిజ్ఞానం, పట్టు సాధించాలని అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి సూచించారు. గురువారం కమిషనరేట్‌లో జూలై 1వ తేదీ నుంచి అమలయ్యే నూతన చట్టాలపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ నుంచి అధికారుల వరకు నెల రోజుల్లో శిక్షణ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీధర్, సీసీఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ జానకిరామ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

చేర్యాల ప్రాంత విద్యార్థులకు అన్యాయం

చేర్యాల, మే 30 : జనగామ జిల్లా నర్మెట్ట గురుకుల పాఠశాలను చేర్యాలలో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేర్యాల పట్టణంలో ఉన్న బాలికల రెసిడెన్షియల్ గురుకుల డిగ్రీ కళాశాలను సిద్దిపేట జిల్లా మిట్టపల్లిలోని ఓ ప్రైవేటు భవనంలోకి తరలించారని దీంతో ఈ ప్రాంత డిగ్రీ చదువుకునే బాలికలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. చేర్యాల ఎస్సీ వసతి గృహానికి సొంత భవనం లేదని పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోకుండా వేరే జిల్లాకు చెందిన పాఠశాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. చేర్యాల ప్రాంత విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ హాస్టల్‌కు భవనం కేటాయించాలన్నారు. సమావేశంలో రాకేశ్‌రెడ్డి, మహేశ్, అనిల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

ఫర్టిలైజర్ దుకాణం సీజ్

దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్, మే 30 : మండల వ్యవసాయాధికారి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా గురువారం చేపట్టిన దాడుల్లో అనుమతి లేకుండా ఫర్టిలైజర్ దుకాణం నడుపుతున్న విషయం తెలుసుకొని సీజ్ చేశారు. మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ గ్రామంలో శ్రీఅయ్యప్ప రైతుసేవా కేంద్రం సీడ్స్ ఫర్టిలైజర్ దుకాణంలో అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. ప్రభుత్వ అనుమతి లేకుండా దుకాణం నడుపుతున్నందున మండల వ్యవసాయాధికారి వసంతరావు దుకాణం సీజ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతి లేకుండా ఫర్టిలైజర్ దుకాణాలు నడపడం చట్టరీత్యానేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామన్నారు.

సీతారాంపల్లి ఘటనపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట టౌన్, మే 30 : కుల వ్యవస్థ విషం చిమ్ముతున్నదని, దేశంలో నేటికి ఆగ్రవర్ణాలు గుడిలోకి రానివ్వకుండా కుట్రలు చేయడం సహించరానిదని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మండిపడ్డారు. సిద్దిపేట మండలం సీతారాంపల్లి గ్రామంలో తోటి మనుషులు అని చూడకుండా హనమాన్ దేవాలయంలోకి దళితలను రాకుండా అడుకున్న ఘటనపై శ్రీనివాస్ గురువారం సిద్దిపేటలో స్పందించారు. ఆలయంలో వెళ్లకుండా అడ్డుకున్న వారిపై పోలీస్ శాఖ వెంటనే స్పందించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

పద్మ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలి

సిద్దిపేట, మే 30 : గణతంత్ర దినోత్సవం-2025 సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే పద్మ అవార్డులకు సిఫారసు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జె. నాగేందర్ తెలిపారు. జిల్లాకు చెందిన రాష్ట్ర, జాతీయ స్థాయిలో, కళారంగం, సామాజిక సేవ, ప్రజాసేవ, విజ్ఞాన శాస్త్రం, ఇంజినీరింగ్, వ్యాపారం, పరిశ్రమలు, వైద్యశాస్త్రం, సాహిత్యం, విద్య, క్రీడలు ఇతర రంగాల్లో విశేష కృషి చేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తాము చేసిన కార్యక్రమాలను 800 పదాలకు మించకుండా www.padmaawards.gov.in వెబ్సైట్‌లో దరఖాస్తు నింపాలని సూచించారు. అట్టి దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో మూడు సెట్లను జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో 3వ తేదీలోపు అందజేయాలని కోరారు. వివరాలకు టెలిఫోన్ నెం. 7780 577861 లకు సంప్రదించగలరన్నారు.

మల్లేశంపల్లిలో నేడు ఉర్సు

రాయపోల్, మే 31 : దౌల్తాబాద్ మండలంలోని మల్లేశంపల్లి లో నేడు హజ్రత్ సయ్యద్ షాదుల్లా బాబా సైలాని గౌస్ ఏ పాక్ హసన్ బాబా హుస్సేన్ బాబాలకు 11వ గంధం జరుగుతుంది. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని ప్రతి ఏడాది నిర్వహించే విధంగా ఈ యేడు కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మహ్మద్ అబ్దుల్ రహీమ్, మా జీ సర్పంచ్ దారా సత్యనారాయణ పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

గజ్వేల్, మే 30 : అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల నరేశ్‌చారి(30) అదే గ్రామానికి చెందిన మరోకరి ఇంట్లోకి సాయంత్రం సమయంలో వెళ్లగా వారింట్లోనే అనుమానాస్పదంగా మృతి చెందాడు. అయితే నరేశ్ చారి మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనాస్థలికి చేరుకునేలోపు మృతదేహం ఉన్న ఇంట్లో వాళ్లు భయంతో పరారీలో ఉన్నారు. విషయం తెలుసుకున్న సీఐ సైదా సిబ్బందితో సంఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. అయితే నరేశ్‌చారిది హత్యగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

దళిత ఏఎస్సైపై దాడి అమానుషం

దుబ్బాక, మే 30 : భూర్జంపాడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న దళిత ఏఎస్సైపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను కఠినంగా శిక్షించాలని జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం దుబ్బాకలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలలో కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం అడ్డుఅదుపు లేకుండా పోయిందని విమర్శించారు. భూర్జంపాడు పోలీసు స్టేషన్‌లో దళిత పోలీసు అధికారిపై కాంగ్రెస్ యువజన నాయకుడు దాడి చేయడం హేయనీయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ఈవిషయంపై దళిత ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు ఏకతాటిపైకి వచ్చి నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎర్రమట్టికి బదులు.. మొరం

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇష్టారాజ్యం

డివైడర్ల మధ్యన పోసిన మొరాన్ని జేసీబీతో చదును చేస్తున్న వర్కర్లు

చేర్యాల, మే 30 : ఎర్రమట్టి పోస్తే మొక్కలు ఏపుగా ఎదగి మంచి వృక్షాలుగా మారడమే కాకుండా చూపరుల కనులకు ఇంపుగా ఉంటాయి. పట్టణంలోని రోడ్డు డివైడర్లలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో భారీగా పూలు పూసే మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలను నాటడంతో అవికాస్తా మంచిగా పెరగడమే కాకుండా నీడను పచ్చదనాన్ని వెదజల్లుతున్నాయి. కొన్ని మాసాల క్రితం జనగామ, సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులను పట్టణంలో సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో ప్రారంభింపజేశారు. చేర్యాల పట్టణంలో నేషనల్ రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా కాంట్రాక్టర్ పాత డివైడర్లను తొలిగించి (గతంలో నాటిన మొక్కలు అలాగే ఉండే విధంగా) వెడల్పుగా డివైడర్లు నిర్మించారు. తాజాగా కొత్తగా నిర్మించిన డివైడర్లు వెడల్పుగా ఉండడంతో మొక్కలను రక్షించేందుకు తిరిగి ఎర్రమట్టి నింపాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ మాత్రం ఎర్రమట్టికి బదులుగా పట్టణంలో నిర్మించిన రెండున్నర కిలోమీటర్ల మేర ఇటీవల డివైడర్లలో మొరం నింపాడు. తాజాగా మొరాన్ని డివైడర్ల మధ్యను జేసీబీతో చదును చేస్తుండడంతో పట్టణవాసులు ముక్కున వెళుసుకుంటున్నారు. ఎర్రమట్టికి బదులుగా మొరం పోస్తున్న విషయాన్ని తెలిసినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టనట్లు ఉండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పట్టణంలో పచ్చదనం కాపాడేందుకు ఎంతో ప్రతిష్టాత్మంగా హరితహారంలో నాటిన మొక్కలు కాపాడేందుకు సంబంధిత శాఖ అధికారులు మొరం తొలిగించి మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బైరాన్‌పల్లిలో 'అఖండ రామనామ' సంకీర్తన

రామనామ స్మరణలో పాల్గొన్న హన్‌మాన్ స్వాములు

మద్దూరు(ధూళిమిట్ట), మే 30 : ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు పార్నంది శంకరయ్యశర్మ ఆధ్వర్యంలో గురువారం అఖండ రామనామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 6గంటలకు ప్రారంభమైన అఖండ రామనామ సంకీర్తన కార్యక్రమాన్ని హన్‌మాన్ స్వాములు 24 గంటల పాటు నిర్విఘ్నంగా కొనసాగించారు. దీంతో గ్రామమంతా రామనామ స్మరణతో మార్మోగింది. స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న ఆపన్న హస్తమిత్ర బృందం సభ్యులు

గజ్వేల్, మే 30: మండల పరిధిలోని గిరిపల్లి గ్రామానికి చెందిన ఎంకమొల్ల స్వామి తొమ్మిదేండ్ల కుమారుడు ప్రణీత్ మల్టీ ఆర్గాన్ ఫెయిలూర్(కిడ్నీ)తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆపన్న హస్తమిత్ర బృందం సభ్యులు అతడి తల్లిదండ్రులకు రూ. 20వేల ఆర్థికసాయం అందజేశారు. గురువారం గ్రామానికి చేరుకున్న ఆపన్న హస్తమిత్ర బృందం సభ్యులు బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని తమవంతుగా సాయం అందజేశారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విషయం తెలుసుకొని ముదిరాజ్ సంఘం నాయకుల ద్వారా రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. మిత్ర బృందం సభ్యులు బాలచంద్రం, శ్రీనివాస్, స్వామి, ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీనివాస్, మహేశ్, రవి, శేఖర్, ఇబ్రహీం,తదితరులు పాల్గొన్నారు.

కొండపాకలో..

కొండపాక(కుకునూరుపల్లి), మే 30 : అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద కుటుంబాలకు భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల ప్రశాంత్ అండగా నిలిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందిన కొండపాకకు చెందిన పోతుగంటి నర్సింహులు కుటుంబాన్ని పరామర్శించి, రూ. 10 వేలు, మర్పడగ గ్రామానికి చెందిన ఇండ్ల కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మిరుదొడ్డిలలో..

మిరుదొడ్డి, మే 30 : రుద్రారంలో గురువారం ఓ నిరుపేద కుటుంబానికి మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ 50 కిలోల బియ్యం అందజేశారు. మాజీ ఎంపీటీసీ నర్సింహులు, నాయకులు భైరవాచారి, కనకయ్య, నవీన్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బెజ్జంకి, మే 30 : మండలంలోని తోటపల్లి శివారులోని మోయతుమ్మెదవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలుంటాయని ఎస్సై కృష్ణారెడ్డి హెచ్చరించారు.

డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎగొండస్వామి

గజ్వేల్, మే 30 : డీబీఎఫ్ రాష్ట్ర నాలుగో మహాసభల్లో రాష్ట్రకమిటీ ఎన్నుకున్నారు. కమిటీలో గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామానికి చెందిన దాసరి ఎగొండస్వామిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. మరోసారి రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యలపై డీబీఎఫ్ ఇచ్చే పిలుపు మేరకు పోరాడుతానన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, మే 30 : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్న నిజాంపేటలో నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న నిజాంపేటకు చెందిన కొనాపురం రాజు (29) కూలీ. ఆర్థికఇబ్బందులు నెలకొనడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసికంగా కలత చెందిన రాజు బుధవారం రాత్రి గ్రామ శివారులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉత్సవాలను విజయంతం చేయాలి

కొండపాక (కుకునూరుపల్లి), మే 30 : జూన్ ఒకటి నుంచి 3వ తేదీ వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ పిలుపి నిచ్చారు. గురువారం ఆయన మాట